క్లుప్తంగా

నేడు వేల్పూరులో 'మన కోసం-మన శంకరన్న'

అచ్చంపేట: వేల్పూరులో ఆదివారం ఉదయం 10 గంటలకు మన కోసం-మన శంకరన్న కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.శివసుబ్రమణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరుకావాలని తెలిపారు.

సంక్షేమ పథకాలతో మహిళల ఆర్థిక ప్రగతి

నకరికల్లు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిపుచ్చుకుని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డీబీఆర్సీ ఏరియా కో-ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిలింగం అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ మహిళలకు ప్రభుత్వ పథకాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మ ఒడి, విద్యా దీవెన, చేయూత, ఉన్నతి, జగనన్న తోడు లాంటి సంక్షేమ పథకాలు మహిళలు ఆర్థికంగా స్థిరపడేందుకు, పిల్లలను చదివించుకునేందుకు ఉపయోగపడతాయన్నారు. జగనన్న తోడు పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నట్లు ఏపీఎం సునీత తెలిపారు. ప్రణాళికతో వడ్డీలేని రుణాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ బాజీ, మహిళా సంఘాల అధ్యక్షురాలు శిలార్ బీ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నకరికల్లు: భూగోళానికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రధానోపాధ్యాయురాలు షేక్.ఫాహిం అన్నారు. అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా చేజర్లలోని ఎస్వీఎస్ఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఓజోన్ పొరకు పర్యావరణం కాలుష్యం కారణంగా రంధ్రాలు ఏర్పడుతున్నాయన్నారు. దాని వల్ల భూమిపై ఉన్న సమస్త జీవరాసులకు ప్రమాదం వాటిల్లే ముప్పు ఉందని తెలిపారు. టీడీహెచ్-ఆర్‌జీఎంఎస్ ఆధ్వర్యంలో వలంటీర్ బోధకురాలు జి.భారతి పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులతో లఘు నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గేరా మోహనరావు, చెరుకూరు వెంకటేశ్వర్లు, షేక్.మల్లిక, ఎస్.లలిత, షేక్.మస్తాన్‌వలి, వెంకట్రావు, బత్తుల సుందర్రావు, ఎన్జీఓ భారతి తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ వితరణ



అచ్చంపేట: స్నేహ హస్తాలు ఫౌండేషన్ గుంటూరులోని మలినేని ఉమెన్స్ కాలేజీలో బీటెక్ రెండవ సంవత్సరం విద్యార్థిని ఉన్నవ మధు రమ్యకు శనివారం ల్యాప్‌టాప్ వితరణ చేసింది. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఇన్నారావు, డాక్టర్ రాంబా అచ్చంపేటలో రూ.35వేలు విలువచేసే ఈ ల్యాప్‌టాప్‌ను విద్యార్థినికి అందజేశారు. నిరుపేద విద్యార్థులను స్నేహ హస్తాలు ఫౌండేషన్ ఆదుకోవడం అభినందనీయమని వారు అన్నారు. సంస్థ ప్రతినిధి తాయి కరిముల్లా బాబు మాట్లాడుతూ విద్యార్థి ప్రాజెక్టు వర్క్ నిమిత్తం ల్యాప్‌టాప్ అందజేసినట్లు తెలిపారు.

బహుళ పంటలతో అధిక ఆదాయం



రాజుపాలెం: సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులు ఏటీఎం మోడల్ విధానంలో సాగుచేయడం ద్వారా ఖర్చులు తగ్గించుకుని, ఆదాయం పెంచుకోవచ్చని జిల్లా వనరుల కేంద్రం అధికారి రామాంజనేయులు అన్నారు. మండలంలోని బ్రాహ్మపల్లి గ్రామంలో సేంద్రియ పంటలను రీజనల్ కో-ఆర్డినేటర్ వెంకట్రావు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలా కుమారితో కలసి శనివారం పరిశీలించారు. ప్రాజెక్టు మేనేజర్ అమలాకుమారి మాట్లాడుతూ ఎకరా విస్తీర్ణంలో అనేక రకాల పంటలు వేయడం ద్వారా అధిక ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్, ఎస్ఎఫ్ఏలు సంధ్య, భవాని రాజ్, ఎంపీటీ భీమన్న, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

మొబైల్‌ఫోన్ దుకాణంలో చోరీ



రేపల్లె రూరల్: గుర్తు తెలియని దుండగులు మొబైల్ ఫోన్ దుకాణంలో నగదు చోరీ చేసిన ఘటన పట్టణంలోని లక్ష్మీటాకీసు సెంటరులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ అబ్దుల్ రజాక్ వివరాల మేరకు.. లక్ష్మీటాకీసు సెంటరులోని దుకాణంలోకి దుండగులు ప్రవేశించిన రూ.5వేల నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితుడు ఎండీ ఖాసిం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని శనివారం పరిశీలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పర్యావరణ హితం.. చవితి సందేశం

- ఈ నెల 18 నుంచి గణేష్ ఉత్సవాలు ప్రారంభం
- మట్టి విగ్రహాలతోనే పర్యావరణానికి రక్షణ
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో కాలుష్యం
- సంప్రదాయాలను పాటించాలంటున్న నిపుణులు
- ప్రజల్లో పెరిగిన అవగాహన

వినాయక చవితి.. పర్యావరణ హిత పండుగ. గణనాథుడి పూజలో వినియోగించే గరిక, చెరకుగడ, జిల్లేడు పూలు, పత్రి, తుమ్మిపూలు, ఉత్తరేణి, అరటి ఆకులు, పూలు, పండ్లు .. ఇలా ప్రతీది ప్రకృతి సిద్ధమైనదే. పూజకు పసుపు లేదా మట్టితో చేసిన గణపతి విగ్రహాలను వినియోగించాలని శాస్త్రం చెబుతోంది. ప్రస్తుతం ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన భారీ వినాయక విగ్రహాలను నెలకొల్పుతుండటంతో పర్యావరణానికి హాని కలుగుతోందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. మట్టి ప్రతిమలనే పూజించాలని కోరుతున్నారు.



పట్టణంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు(ఫైల్)



మట్టి వినాయక విగ్రహాల తయారీని పరిశీలిస్తున్న కొత్త రామకృష్ణ

సత్తెనపల్లి: పండగలు, సంప్రదాయల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాల్సిన తరుణమిది. కాలుష్యానికి కారణమయ్యే వాటిని పక్కన పెట్టి పర్యావరణ సహిత విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. గణపతి ఉత్సవాలను పర్యావరణ హితంగా జరుపు కోవాలన్న స్పృహ అందరిలోనూ పెరిగింది. గ్రామాల్లో మట్టి గణపతుల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో మట్టి విగ్రహాల తయారీదారులకు ప్రోత్సాహం లభిస్తోంది.

18 నుంచి ఉత్సవాలు..

వినాయక చవితి ఉత్సవాలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో గణనాథుల విగ్రహాల విక్రయాలు ఊపందుకున్నాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలతో వాతావరణం కలుషితమవుతోంది. దీంతో గత కొన్నేళ్లుగా మట్టి వినాయక విగ్రహాల వినియోగం క్రమంగా పెరుగుతోంది. అధికార యంత్రాంగం కూడా మట్టి విగ్రహాలకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఈ క్రమంలో గత 8 సంవత్సరాలుగా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో పట్టణం, అనేక గ్రామాల్లో పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీచేస్తున్నారు. పట్టణంలో రామకృష్ణ ఆధ్వర్యంలో 1,500 నుంచి 2 వేల వరకు మట్టి వినాయక విగ్రహాలను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సోమవారం పంపిణీ చేయనున్నారు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో హాని..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని వైద్యులు, ప్రముఖులు సూచిస్తున్నారు. నిమజ్జనం చేసినప్పుడు నీటిలో త్వరగా కరగకుండా కాలుష్యానికి కారణమవుతుందని, ఆ నీటితో పంటలు దెబ్బతినడంతో పాటు జంతువులు, మనుషులు తాగితే క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అలాగే .. వివిధ రకాల చర్మ వ్యాధులు ప్రబలుతాయని హెచ్చరిస్తున్నారు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ అనారోగ్యం



ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను కెమికల్‌తో తయారు చేస్తారు. ఆ విగ్రహాలు నీటిలో ఆలస్యంగా కరుగుతాయి. నీరు కాలుష్యం కావడం, ఆ నీటిని ప్రజలు తాగడం వల్ల అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఇది గమనించి, గత ఎనిమిది సంవత్సరాలుగా మేము మట్టి వినాయక విగ్రహాలను తయారు చేయించి, పంపిణీ చేస్తున్నాం. ఈ ఏడాది కూడా పంపిణీ చేయనున్నాం.

కొత్తా రామకృష్ణ,
అధ్యక్షుడు, ఆర్యవైశ్య యువజన సంఘం, సత్తెనపల్లి.

మట్టి విగ్రహాలతో ఎలాంటి హాని ఉండదు



మట్టి వినాయక విగ్రహాలను పూజించడంతో పర్యావరణానికి ఎలాంటి హానీ ఉండదు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో విగ్రహాల వల్ల తయారీదారులకు ఇబ్బందులే. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను తయారు చేసే వారు వివిధ రకాల వ్యాధుల బారిన పడతారు.

డాక్టర్ బి.లక్ష్మణరావు,
సూపరింటెండెంట్, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి.

ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు

మన కోసం – మన శంకరన్న కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు



ఎండ్రాయి గ్రామసభలో ఎమ్మెల్యే శంకరరావుకు సమస్యను వివరిస్తున్న మహిళ

అమరావతి: ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని వైకుంఠపురం గ్రామంలో మన కోసం- మన శంకరన్న కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తీసుకొచ్చిన సమస్యలకు పరిష్కారం లభించిందా..లేదా.. అన్న విషయం తెలుసుకునేందుకు ప్రతి గ్రామంలో సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి నేరుగా సమస్యలు ఎమ్మెల్యే తెలుసుకున్నారు. అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ప్రధానంగా గ్రామస్తులు విద్యుత్, డ్రెయినేజీ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి నెలా గ్రామాలకు వెళ్లి పారిశుద్ధ్యం, ఇతర సమస్యలను తెలుసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే గ్రామస్తులకు సూచించారు. అలాగే సాయంత్రం చావపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చిలకా ఆనందరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శంకరరావు గ్రామ సభ నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన వినతులపై సమీక్ష నిర్వహించారు. ఎండ్రాయి సచివాలయంలో సర్పంచ్ నాయుడు రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభలో పలు సమస్యలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ మూడు గ్రామాల్లో తన దృష్టికి తెచ్చిన సమస్యలను 95 శాతం పరిష్కరించామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కోట హరిబాబు, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, జెడ్పీటీసీ కరుణకుమారి మాజీ చైర్మన్ వెంపా జ్వాలలక్ష్మి, సచివాలయాల కన్వీనర్ నాయుడు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు భవిరిశెట్టి హనుమంతరావు, శ్రీనివాసరెడ్డి, చిలకా సాంబయ్య, వైకుంఠపురం ఉప సర్పంచ్ గుబ్బా కృష్ణయ్య, అధికారులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలతో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు కరదీపికలను అందజేస్తున్న అధికారులు, ఎంపీపీ

బెల్లంకొండ: పంటల సాగులో రసాయనాలు అధికంగా వినియోగించడం వల్ల భూమి సారవంతం కోల్పోయి దిగుబడులు తగ్గుతున్నాయని జిల్లా వనరుల కేంద్రం అధికారి రామాంజనేయులు అన్నారు. శనివారం మండలంలోని నాగిరెడ్డిపాలెం రైతు భరోసా కేంద్రంలో సెర్ప్, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సుకు పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి అధ్యక్షత వహించారు. రీజినల్ కో-ఆర్డినేటర్ వెంకట్రావు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల ద్వారా సమావేశాలు నిర్వహించి, ప్రకృతి వ్యవసాయంపై అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. సహజ సిద్ధమైన ఆవు పేడ, మూత్రం, పలు రకాల ఆకులతో తయారు చేసిన నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నాస్త్రం, కషాయాల ద్వారా ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను పొంది, లాభాలను గడించాలని సూచించారు. అనంతరం రైతులకు వ్యవసాయ విధానంపై కరదీపికలను అందజేశారు. జిల్లా అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజు, ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి, వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య, ఏపీఎం శివకుమార్, సీసీలు నాగమల్లేశ్వరి, సతీష్, సంధ్య, భవాని, అనంతలక్ష్మి, సొసైటీ ప్రెసిడెంట్ భద్రయ్య, సర్పంచ్ బద్దూరి శ్రీలక్ష్మి, శేషిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

రజకులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణం



పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్న రజక సంఘాల ఐక్యవేదిక నాయకులు

అమరావతి: రజకులను కించపరిచే విధంగా విమర్శలు చేసిన టీడీపీ మహిళా నాయకురాలు, వాటిని ప్రసారం చేసిన ఏబీఎన్ న్యూస్ చానల్ యాజమాన్యంపై మండల రజక సంఘాల ఐక్యవేదిక నాయకులు శనివారం అమరావతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘ నాయకుడు వాడపర్తి పుల్లారావు ఆధ్వర్యంలో సత్తెనపల్లి రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. పుల్లారావు మాట్లాడుతూ రజకులపై కొందరు ఉద్దేశపూర్వకంగా, కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ చేపట్టిన నిరసనలో ఓ మహిళా నాయకురాలు రజక కులాన్ని కించ పరిచే విధంగా చేసిన వ్యాఖ్యలను ఏబీఎన్ న్యూస్ చానల్‌లో యథాతథంగా ప్రసారం చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. రజక జాతికి వారు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణదాసు, నరసింహారావు గుంటకల శ్రీనివాసరావు, తుమ్మపూడి వెంకయ్య, బలుసుపాటి కరిముల్లా, శ్రీనివాసరావు, అంకారావు, ముసలమడుగు సురేంద్ర, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా వైకుంఠపురం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- ఘాట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకరరావు

అమరావతి: కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి కొలువైన వైకుంఠపుర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని పెదకూరపాడు శాసన సభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. వైకుంఠపురం కొండపైనున్న అలివేలు మంగ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే ఘాట్ రోడ్డు నిర్మాణానికి ఆయన శనివారం భూమిపూజ నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి టీటీడీ నుంచి రూ.25 లక్షలు, ఎంపీ నిధులు మరో రూ.10 లక్షలు మంజూరయ్యాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. వాటితో పాటు దాతల సహకారంతో ఘాట్ రోడ్డు నిర్మాణం త్వరలోనే పూర్తిచేస్తామని చెప్పారు. వైకుంఠపురం ఎంతో మహిమ గల పుణ్య క్షేత్రమని.. పక్కనే ఉన్న కృష్ణానదీ తీరంతో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందే అవకాశాలున్నాయన్నారు. అందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నామని వెల్లడించారు. సతీమేతంగా ఎమ్మెల్యే శంకరరావు కొండపైన, కొండ కింద వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ గుబ్బా కృష్ణయ్య, మంగిశెట్టి కోటేశ్వరరావు, మంగిశెట్టి శ్రీనివాసరావు, రంగిశెట్టి శ్రీనివాసరావు, కుమ్మరి మిఖైల్, నందూరు రామారావు, శ్రీనివాసరావు పసుపులేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పక్కాగా ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలు నమోదు

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పరిశీలనలో డీఎం అండ్ హెచ్‌ఓ రవి



గోళ్ళపాడులో సర్వేను పరిశీలిస్తున్న డీఎం అండ్ హెచ్‌ఓ రవి

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలు తెలుసుకొని, యాప్‌లో నమోదు చేయాలని వైద్య సిబ్బందిని జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డా, బి.రవి ఆదేశించారు. మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఆయన శనివారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, అందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని చెప్పారు. వైద్య సిబ్బంది, గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సమస్యలు, అవసరాలను తెలుసుకొని యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం నిర్వహించే వైద్య శిబిరాల్లో పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందించాలన్నారు. తహసీల్దారు ఎం.భవానీ శంకర్, వైద్యాధికారి పి.రమాదేవి, సీహెచ్‌ఓ ఆంజనేయులు, సూపర్‌వైజర్లు పీటర్ డేనియల్, జోస్పిన్ రాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభానికి గోదాములు సిద్ధం



గోళ్ళపాడులో ప్రారంభానికి సిద్ధంగా గోదాము



మాదలలోని గోదాము

ముప్పాళ్ళ: రైతులు పంట ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు గాను అవసరమైన గోదాముల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రూరల్ అగ్రికల్చర్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలోను(మల్టీ పర్పస్) గోదాముల నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంది. పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించనప్పుడు వాటిని నిల్వ చేసుకొని, ధర ఉన్నప్పుడు అమ్ముకునేలా సాగును ప్రోత్సహిస్తూ ఈ గోదాములు నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. సాగుకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు కూడా అందించనున్నారు. నాబార్డు నిధులతో రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు సహకారంతో ఈ నిర్మాణాలు చేపట్టారు. మండల పరిధిలోని మాదల, గోళ్ళపాడు, లంకెలకూరపాడు గ్రామాల్లో 500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల గోదాములు మంజూరు కాగా, వాటిలో గోళ్ళపాడు, మాదల గ్రామాల్లో నిర్మాణాలు పూర్తియ్యాయి. ఒక్కో గోదాము నిర్మాణానికి రూ. 40 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఆయా గోదాములను మాదల, ముప్పాళ్ళ ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘాలు నిర్వహించనున్నాయి. లంకెలకూరపాడు గ్రామంలోని గోదాము నిర్మాణం చివరి దశలో ఉంది.

ప్రజారోగ్యమే పరమావధి

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ చంద్రశేఖర్

సత్తెనపల్లి: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పల్నాడు జిల్లా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని పెద్దమక్కెన గ్రామంలో శనివారం ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ యు.శ్రీలక్ష్మీకవిత ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. 102 మందికి ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సర్వేను డాక్టర్ చంద్రశేఖర్ ఆకస్మికంగా సందర్శించి, పర్యవేక్షణ చేశారు. ఈ నెల 30 వరకు గ్రామాల్లో సర్వే చేసి, తద్వారా పేదల ఇంటికి వెళ్లి వైద్యసేవలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నాని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో రుగ్మతలను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. వైద్య బృందాలు ఇంటికి వచ్చిన సందర్భంగా వ్యాధి పరిష్కారం కాని పరిస్థితుల్లో మెరుగైన వైద్యసేవలకు పెద్ద ఆస్పత్రులకు తరలించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఎస్ మీనాక్షమ్మ,హెచ్‌వీ వరలక్ష్మి, పంచాయతీ సెక్రటరీలు జి.వెంకటేశ్వరరావు, పి.అంకమ్మ రావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం..ప్రభుత్వ లక్ష్యం



నకరికల్లు: ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. నకరికల్లులో వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులకు ‹జగనన్న ఆరోగ్య సురక్ష› సర్వేపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్ఎంల ఆధ్వర్యంలో వలంటీర్లు ఇంటింటికి వెళ్లి, ప్రజల ఆరోగ్య పరిస్థితిని నమోదు చేసుకోవాలన్నారు. అనారోగ్య సమస్యలున్న వారిని గుర్తించి, అక్టోబర్ 5న స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించే వైద్య శిబిరానికి వారిని తీసుకొచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ పరసా అంజమ్మ, వైస్ ఎంపీపీ దుదేకుల హుస్సేన్‌బి బాషా, సచివాలయం కన్వీనర్ శాగం చంద్రశేఖర రెడ్డి, షేక్.సలీల్, గ్రామ కార్యదర్శి భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు చెక్కు అందజేత

బెల్లంకొండ: చండ్రాజుపాలెం గ్రామానికి చెందిన వల్లాల మణికంఠ గత నెలాఖరున రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకం వర్తించడంతో.. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు రూ.5లక్షల నగదు చెక్కును శనివారం మృతుని భార్య సంధ్యా రాణికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ గాదె వెంకటరెడ్డి, సర్పంచ్ బాబూజీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నాయకత్వంపై మహిళలకు అవగాహన

అమరావతి: స్థానిక గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం కో-ఆపరేటివ్ సొసైటీ మహిళలకు నాయకత్వ లక్షణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిస్టర్ విన్నారసి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. రేస్ సంస్థ డైరెక్టర్ జి.నళిని మాట్లాడుతూ మహిళలకు సొసైటీ ద్వారా ఎన్నో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ గుడ్ షెపర్డ్ సంస్థ సహకారంతో ఎంతోమంది మహిళలు నాయకత్వ లక్షణాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కో-ఆర్డినేటర్ టి.లక్ష్మణ్. కమ్యూనిటీ మొబిలైజర్స్ టి.బ్యూలా, మరియమ్మ, బాబు, పవన్, దిలీప్ కుమార్, సిస్టర్ మార్టిన పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చేపట్టాలి



అచ్చంపేట: అధిక వర్షాల కారణంగా పొలాల్లో నీరు నిలబడి పత్తి మొక్కలు ఎదుగుదల లేక గిడసబారాయని, అలాంటి పంటపై యురియా లేదా పొటాషియం పిచికారి చేయాలని లాంఫాం శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని వేల్పూరు, గ్రంథసిరి గ్రామాల్లో శనివారం వారు పత్తి పంటను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారికి తగు సూచనలు చేశారు. మొక్క ఎదుగుదల లేకపోవడానికి ప్రధాన కారణం నేలలో అధిక తేమ ఉండటమని వివరించారు. ఎకరాకు 2 నుంచి 4 కేజీల యూరియా, లేదా 1 శాతం పొటాషియం ద్రావణాన్ని మొక్కలు బాగా తడిచే విధంగా పిచికారి చేసుకోవాలి చెప్పారు. పచ్చదోమ, తామర పురుగుల ఉధృతి అక్కడక్కడా ఉన్నట్లు గుర్తించామని శాస్త్రవేత్తలు తెలిపారు. ఎకరాకు నాలుగు చొప్పన లింగాకర్షక బుట్టలు పెట్టుకొని, తగిన సస్యరక్షన చర్యలు చేపట్టాలని వివరించారు. కార్యక్రమంలో లాంఫాం శాస్త్రవేత్తలు బి.లక్ష్మి, జీపీ దయానా, ఏవో వెంకటేశ్వర్లు, విస్తరణాధికారులు నాగరాజు, పవన్ పాల్గొన్నారు.